
# ఒక హక్కు - వంద ఆంక్షలు



అభయారణ్యంలోని భూములలో ఆదివాసులకు రాష్ట్ర ప్రభుత్వం సాగుహక్కు కల్పించాలని నిర్ణయించిందన్న వార్త అమాయకులకు సంతోషం కలిగించి ఉండవచ్చును గానీ వాస్తవాలు తెలిసినవారికి మాత్రం ఆశ్చర్యం కలిగించింది. నిజానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలంటూ పత్రికలలో వచ్చే వార్తలను అనుమానంగా చూసే ఆరోగ్యసూచకమైన లక్షణం ప్రజలకు ఇప్పటికే అలవడిందిగానీ పత్రికలు తెలివిగా వాఖ్యానిస్తున్నామనుకుంటూ వాటికి లేనిపోని విశ్వసనీయత కల్పిస్తున్నాయి. ఎన్నికలు దగ్గరికొచ్చాయి కాబట్టి ప్రభుత్వం ఆదివాసులపైన వరాల జల్లు కురిపిస్తున్నదని పత్రికలు వ్యాఖ్యానించడం, మీడియా ఇంటర్వ్యూ నుంచి మీడియా ఇంటర్వ్యూకు పయనించే ప్రతిపక్ష నాయకులు దానిని అందుకొని ఎన్నికలొచ్చినప్పుడే అడవివాసులు జ్ఞాపకం వస్తారా అని ఆవేశంగా పునరుచ్ఛరించడం, అది నిజమేనేమోనన్న అభిప్రాయం కలిగించివుంటాయి.

మొదటి వాస్తవమేమిటంటే వై.ఎస్.ప్రభుత్వం ఈ విషయంలో తీసుకోవలసిన నిర్ణయమేదీ లేదు. ఆ నిర్ణయం దేశ పార్లమెంటు తీసేసుకుంది. అభయారణ్యాలతో సహా సకల అరణ్యాలలోనూ ఆదివాసులకూ, మూడుతరాలుగా అడవివాసులుగా ఉన్న ఇతర ప్రజలకూ సాగు హక్కులతో సహా సకల వినియోగ హక్కులూ కల్పిస్తూ పార్లమెంటు చట్టం చేసింది. 'ఆదివాసులు, ఇతర సంప్రదాయక అటవీవాసుల (అటవీహక్కుల పరిరక్షణ) చట్టం' అని పేరుపెట్టిన ఈ శాసనాన్ని క్లుప్తంగా 'అటవీహక్కుల చట్టం'అని పిలుస్తున్నారు. మన పాలకులు ఎప్పటికప్పుడు గొప్పపనులు చేస్తున్నట్టే వ్యవహరిస్తారు తప్ప ఆత్మవిమర్శ చేసుకోరు. ఆ విషయంలో ఇది అసాధారణమైన చట్టం. వలసపాలనలోనూ, ఆతరువాత కూడ అడవులను పరిరక్షించే ప్రక్రియ అటవీ భూములలో తరతరాలుగా నివసిస్తున్న ప్రజల హక్కులను గుర్తించడంలో విఫలమయిందనీ, అడవివాసులయిన షెడ్యూల్డు తెగలకూ ఇతర సంప్రదాయక అడవివాసులకూ అన్యాయం చేసిందనీ ఈ చట్టం ఉపోద్ఘాతంలో


> ఆదివాసుల అడవి హక్కులను గుర్తించే ఈ చట్టమంటే చాలామందికి ఇష్టం లేదు. అడవులలో ఉమ్మడి ఫలసేకరణ హక్కు ఇస్తే పరవాలేదు గానీ వ్యక్తిగత సాగుహక్కు ఇస్తే అడవులు నాశనం అయిపోతాయని అభ్యంతరం పెడుతూ వచ్చారు.



రాసారు. ఆ సత్యాన్ని గుర్తించి ఈ చట్టాన్ని చేశామన్నారు. ఇంక రాష్ట్రప్రభుత్వం చేయవలసిందేముంది? పార్లమెంటు చేసిన చట్టాన్ని గుర్తిస్తున్నామని నిర్ణయం చేసారా? గుర్తించడం లేదని నిర్ణయంచేసే స్వేచ్ఛ వారికి ఉందా? రెండవ వాస్తవం ఏమిటంటే 2006 డిసెంబర్‌లో పార్లమెంటు జారీ చేసిన ఈ చట్టం 2008 జనవరి దాకా అమలులోకి రాలేదు. కొన్ని చట్టాలు ఎప్పుడు అమలులోకి వస్తాయనేది ఆ చట్టంలోనే రాసి ఉంటుంది. కొన్ని 'ప్రభుత్వం అమలులోకి తెచ్చినప్పుడు' అమలవుతాయని రాసివుంటుంది. పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన చట్టాన్ని కూడా కార్యనిర్వాహకశాఖ ఈ అవకాశాన్ని వాడుకొని అమలులోకి తేకుండ ఉండవచ్చు. అప్పుడు న్యాయస్థానాలు సహితం అమలులోకి తెమ్మని ఆదేశించజాలవు. పూర్తిగా అప్రజాస్వామికమైన ఈ స్థితి ఇది ఒక న్యాయసిద్ధాంత సూత్రంగా గుర్తింపు పొందింది. అటవీహక్కుల చట్టాన్ని వెంటనే అమలులోకి తీసుకురాకుండా ప్రభుత్వం తీసుకొచ్చినప్పుడు అమలవుతుందని రాయడం వెనుక, ఒక సంవత్సరం దానిని అమలులోకి తీసుకురాకపోవడం వెనుక చాలా ఒత్తిళ్లు పనిచేసాయనేది మూడవ వాస్తవం. ఆదివాసుల అడవి హక్కులను గుర్తించే ఈ చట్టమంటే చాలామందికి ఇష్టం లేదు. ఆదివాసులకు అడవులలో ఉమ్మడి ఫలసేకరణ హక్కు ఇస్తే ఫరవాలేదుగానీ వ్యక్తిగత సాగుహక్కు ఇస్తే అడవులు నాశనం అయిపోతాయని, వన్యప్రాణులు అంతరించిపోతాయని పర్యావరణవాదులు అభ్యంతరం పెడుతూవచ్చారు. అడవులను పొలాలుగానూ ఆ పైన నగరాలుగానూ మార్చి భూములలో, ఇళ్లలో, కార్లలో అన్నిటిలోనూ స్వంత యాజమాన్యహక్కు కల్పించిన నాగరికతకు వారసులైన వారు ఆదివాసులకు మాత్రం తాము సాగుచేసుకుంటున్న భూములపైన హక్కులు ఇవ్వొద్దనడం ఏరకమైన నీతో అర్థంకాదు. ఆదివాసులు బతికే స్థాయిలో అడవులలో వ్యవసాయం చేసుకుంటే అడవులూ అంతరించిపోవు, వన్యమృగాలూ అంతరించిపోవు. అంతకుమించిన స్థాయిలో వినియోగాన్ని పెంచిన నాగరికతే ప్రకృతి క్షీణతకు కారణమయింది. దానిని ఏ మాత్రం తగ్గించుకోవడానికి సిద్ధపడని వారు నోరులేని ప్రజలమీద ఆంక్షలు పెట్టడం దుర్మార్గం.

దుర్మార్గమైన ఆలోచనయితే కావచ్చునుగానీ దీనికి బలమైన అండ దొరికింది. వేరెవరో కాదు, సాక్షాత్తు భావి భారత ప్రధాని రాహుల్‌గాంధి ఈ వికృత పర్యావరణ వాదానికి మద్దతుగా నిలిచాడు. అతను గణతంత్ర దినోత్సవంనాడు ఢిల్లీ నగర వీధులలో తలలో ఈకలు పెట్టుకొని నృత్యాలు చేసే ఆదివాసీ బృందాలను కాక వేరే అడవివాసుల నెప్పుడయినా చూసాడోలేదో తెలీదు. ఫారం కోళ్లు తప్ప వేరే వన్యమృగాలను చూసాడో లేదో తెలీదు. అయినప్పటికీ అటవీ హక్కుల చట్టం అమలులోకి వస్తే ఆదివాసులను అడ్డం పెట్టుకొని వన్యమృగాల వేటగాళ్లు యదేచ్ఛగా సంచరిస్తారన్న అభ్యంతరానికి అతను గొంతు కలిపాడు. అటవీశాఖకూ ఈ చట్టం అంటే ఇష్టం లేదు. వాళ్లకు చెట్లంటే ప్రేమని కాదు. డబ్బులిచ్చి చెట్లు కొట్టుకుపోతే చూస్తూ ఉండే ఆచారం అటవీ శాఖలో అనాదిగా ఉంది. అయితే ఈ మధ్యకాలంలో ప్రపంచబ్యాంకు వంటి సంస్థలు అటవీ సంరక్షణకు భారీగా నిధులు గుమ్మరిస్తున్నాయి. వారికి సహితం చెట్లంటే ప్రేమని కాదు. విపరీతమైన పర్యావరణ క్షీణతకు కారణమైన పాశ్చాత్య జీవనశైలినీ దానిని అనుకరించే మనబోటి దేశాల ధనిక వర్గాల జీవనశైలినీ చెక్కుచెదరకుండ కాపాడుతూ (దానిపైన చాలా పెట్టుబడుల భవితవ్యం ఆధారపడి ఉంది కాబట్టి) పర్యావరణ సమతుల్యత మరీ దెబ్బ తినకుండ చూసుకోవాలంటే ఇంకా మిగిలి ఉన్న అడవులను పదిలంగా కాపాడటం అవసరమన్న గుర్తింపు ఈ నిధుల ప్రవాహానికి కారణం. పోలీసులకూ ఇష్టం లేదు. నక్సలైట్లు బలంగా ఉండే ప్రాంతాలలో అడవులలోని ఆవాసాలన్నిటినీ బలవంతంగానైనా సరే ఖాళీ చేయించడమే నక్సలైట్లను ఏరివేయడానికి అనువయిన మార్గం అన్న అభిప్రాయం పోలీసు యంత్రాంగంలో ఎప్పటినుండో ఉంది. ఛత్తీస్‌గఢ్‌లోనయితే సల్వాజుడుం పేరిట ప్రైవేట్ హంతక ముఠాకు రక్షణ కల్పించి అడవులను బలప్రయోగంతో ఖాళీ చేయించారు. అడవులలో సంప్రదాయ హక్కులను గుర్తించడం 'నక్సలైట్ల ఏరివేత'కు అశనిపాతం అని పోలీసుల అభిప్రాయం.ఇక మధ్యభారతంలోని అపార ఖనిజ సంపద మీద కన్నేసిన రిలయన్స్, జిందాల్, టాటా వంటి యాజమాన్యాలకూ, వారితో వేలకోట్ల రూపాయల ఎం.వో.యు.లు రాసుకొని కమిషన్లు పొందిన సకల రాజకీయ పక్షాల నాయకులకూ కూడా ఈ చట్టం అంటే ఇష్టం లేదు. ఇట్లాగయితే భారత ఆర్థిక వృద్ధిరేటు సింగపూర్‌నో, చైనానో ఎన్నడు దాటేను? ఇన్ని అభ్యంతరాల నడుమ ఒక్క సంవత్సరం ఆలస్యంగానైనా అటవీహక్కుల చట్టం అమలులోకి వచ్చిందంటే ఆశ్చర్యమే. దాని పూర్తి కథ బయటికొచ్చిన రోజు ఎవరిని అభినందించాలో తెలుస్తుంది. చివరి వాస్తవమేమిటంటే ఈ సంవత్సరకాలంలో ఈ చట్టం అమలుకు గండికొట్టే ప్రయత్నం మన రాష్ట్రంతో సహా అన్ని రాష్ట్రాల్లోనూ జరిగింది. అడవులలో ఉంటూ హక్కులు అనుభవిస్తూ ఉంటే కదా ఈ చట్టం ఫలితం పొందేది? అది అమలులోకి వచ్చే లోపల అడవులు ఖాళీ చేయించేస్తే అమలులోకి వచ్చిన తరువాత గుర్తింపు పొందడానికి ఏం హక్కులు ఉంటాయి?మన రాష్ట్రంలోని నల్లమల అడవుల నుంచి చెంచులను బయటకు తరిమేసే ప్రక్రియ ఈ చటాన్ని పార్లమెంటు ఆమోదించిన తెల్లవారే మొదల యింది. నిన్న మొన్నటిదాకా కొనసాగింది. అడవులలో ఉంటే మీ ఇళ్లు కాల్చేస్తాం అని పోలీసులు బెదిరించారు. ఇక్కడ ఒకరూ అక్కడ ఒకరూ ఉంటే మీకు సేవలు అందించలేం, ఒక దగ్గరకు రండి అని ఇతర ప్రభుత్వ శాఖలు ఒత్తిడి పెట్టాయి.

నల్లమల అడవులలో దాదాపు 40 వేల మంది చెంచులు ఉంటారని అంచనా. వీరంతా అభయార ణ్యంలో నూ, అభయారణ్యాం అంచునా జీవిస్తారు. ఈ రోజు వారికి అభయారణ్యంలో సాగు హక్కులు కల్పిస్తామంటున్న ప్రభుత్వం ఆ హక్కును గుర్తించిన చట్టాన్ని పార్లమెంటు



> అటవీశాఖ, పోలీసు శాఖ, కొన్ని సందర్భాలలో గిరిజన సంక్షేమ శాఖ కూడా ఒకటై ఆదివాసులను అడవుల నుంచి బయటకు నెట్టేసి ఏ హక్కులూ పొందలేకుండా చేసిన ఉదంతాలు కొల్లలు.

ఆమోదించిన తరువాత, దాని అమలు మొదలయ్యే లోపల , వారందరినీ అడవినుంచి బయటకు తరిమేసే ప్రయత్నం గట్టిగా చేసింది. కొన్ని వేల మంది బయటికొచ్చేశారు లేదా అడవిలోనే తమ భూములు వదులుకొని అప్పాపూర్ వంటి సాపేక్షంగా పెద్దదయిన ఊర్లలో చేరారు. అక్కడ కట్టిస్తామని హామీ ఇచ్చిన ఇళ్లు లేవు. డబ్బులిస్తామని హామీ ఇచ్చిన భూములు లేవు. ఇప్పుడు అమలులోకి వచ్చిన అటవీహక్కుల చట్టం వారి హక్కులకిచ్చే గుర్తింపును పొందే అవకాశమూ లేదు. వారు వదిలిపెట్టివచ్చిన భూములలో అటవీశాఖ మొక్కలు నాటేసి ప్లాంటేషన్లు చేపట్టిన సందర్భాలు సహితం ఉన్నాయి. ఖమ్మం జిల్లా భద్రాచలం డివిజన్‌లో ఛత్తీస్‌గఢ్ నుంచి సల్వాజుడుం దెబ్బకు పారిపోయి వచ్చి అడవులలో ఆవాసాలు ఏర్పరచుకున్న గొత్తికోయల గుడిసెలను అటవీ శాఖ పదే పదే తగలబెట్టిన ఘటనలు ఈ సంవత్సరకాలంలో అనేకం జరిగాయి. సల్వాజుడుం ప్రారంభమయింది 2005 జూన్‌లో. దంతెవాడ జిల్లాలోని అడవి ప్రాంత ఆదివాసులను బలప్రయోగంతో రహదారి శిబిరాలలోకి తరలించే ప్రయత్నం సల్వాజుడుం చేసింది. దానికి తలొగ్గడం ఇష్టంలేని ఆదివాసీ కుటుంబాలు పెద్ద సంఖ్యలో ఖమ్మం జిల్లాలోకి పారిపోయి వచ్చి అడవులలో గుడిసెలు వేసుకొని పరిసర గ్రామాలలో కూలి చేసుకొని బతకసాగాయి. ఈ కుటుంబాల వారు దాదాపు పదివేల మంది ఉంటారని అంచనా. ఎక్కువ భాగం 2005 జూన్-డిసెంబర్ మాసాల మధ్య పారిపోయి వచ్చారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం 2005 డిసెంబర్ 13 నాటికి అడవులలో ఆదివాసులు అనుభవిస్తున్న హక్కులకు గుర్తింపు లభిస్తుంది. కాబట్టి ఆ చట్టం అమలులోకి వచ్చే లోపల వారి ఆవాసాలను తగలబెట్టి ఛత్తీస్‌గఢ్‌కు తరిమేస్తే వారి బెడద పోతుందని భద్రాచలం అటవీశాఖ అధికారులు భావించారు. పదేపదే ఇళ్లు కాలబెట్టారు. ఈ రోజు అభయారణ్యాలలో సహితం ఆదివాసులకు సాగుహక్కు కల్పిస్తామంటున్న ప్రభుత్వాన్ని ఒక ప్రశ్న అడగాలి. ఈ సంవత్సరకాలంలో ప్రకాశం, మహబూబ్‌నగర్‌ల నుంచి ఖమ్మం దాకా, చెంచులనుంచి గొత్తి కోయల దాకా, బలవంతంగా అడవులను ఖాళీచేయించిన ఆదివాసీ కుటుంబాలన్నీ తిరిగి తమ ఊళ్లకుపోయి తమ భూములలో అటవీశాఖ మొక్కలు నాటి ఉంటే వాటిని పీకేసి ఎప్పటిలాగే సాగుచేసుకొని బతకవచ్చునన్న బహిరంగ ప్రకటన చేస్తారా?

– కె. బాలగోపాల్